సాక్షి
కాకినాడ

బుధవారం ‌। 27 । సెప్టెంబర్ । 2023

I



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం : వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి జంపన కృష్ణంరాజు, బంగారమ్మ దంపతులు (మురమళ్ల) రూ.లక్ష విరాళం అందించినట్లు ఈఓ. ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



కాలువలకు నీరు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 4,700,మధ్య డెల్టాకు 2,000,పశ్చిమ డెల్టాకు 7,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 32.20అడుగులకు నీటి మట్టం చేరింది.

బాలలూ.. ప్రాజెక్టులు రూపొందిద్దామా..!

నేటి బాలలే..భవిష్యత్ శాస్త్రవేత్తలు అవుతారన్నది అక్షర సత్యం. ఈ విషయాన్ని అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలు నిరూపించారు.



II లో

న్యూస్‌రీల్

జైగణేష్ లడ్డు పాట రూ.47,500



లడ్డు పాడుకున్న భక్తులు

పిఠాపురం: పిఠాపురంలో ప్రముఖ వినాయక దేవాలయం జైగణేష్ ఆలయంలో నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన లడ్డును భక్తులు వేలంలో రూ 47500లకు పాడుకున్నారు. ఆలయంలో మంగళవారం లడ్డు పాట నిర్వహించారు. పిఠాపురం మండలం జల్లూరుకు చెందిన కోలా రాజు, వీరంరెడ్డి చక్రిలు లడ్డును పాడుకున్నారు. ఈకార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు 13 అర్జీలు

కాకినాడ సిటీ: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని జేసీ ఎస్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ఆమె డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 13 మంది సంక్షేమ పథకాల లబ్ధి, విద్య, ఉపాధి, భూ సర్వే, భూ సమస్యలు, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 18004253077కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేశారు. ఫోన్ ద్వారా తెలియజేసిన సమస్యలను నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలన్నారు. 13 మంది వ్యక్తుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు పంపామన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో కె శ్రీధర్ రెడ్డి, ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు, వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎలుకల సామూహిక నిర్మూలన



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

గండేపల్లి: జిల్లా పరిధిలోని ప్రతి మండలంలోనూ బుధవారం ఎలుకల సామూహిక నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని యర్రంపాలెంలో మంగళవారం ఆయన వ్యవసాయ క్షేత్రస్థాయి పర్యటన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 75శాతం ఈ–క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. ఈ నెల 30 నాటికి నూరుశాతం పూర్తి చేస్తామన్నారు. ఈయన వెంట ఏడీఏ వైవి గంగాధర్ కుమార్, గండేపల్లి, జగ్గంపేట ఏఓలు ఏ సద్గురుమూర్తి, శ్రీరామ్, హెచ్ఏఓ కరుణాకర్ రాజు, రైతులు ఉన్నారు.

రోడ్ కం రైల్ బ్రిడ్జిపై వాహనాలు దారి మళ్లింపు



రాజమహేంద్రవరం సిటీ: రోడ్ కం రైల్వే బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులతో పాటు అన్ని వాహన రాకపోకలను దారి మళ్లించినట్లు జిల్లా ఎస్పీ జగదీష్, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం మంగళవారం వేరువేరు ప్రకటనల్లో తెలిపారు. బుధవారం నుంచి అక్టోబరు 26వ తేదీవరకూ ఈ బ్రిడ్జిపై రాకపోకలు పూర్తి స్థాయిలో నిలిపివేస్తున్న సంగతి తెలిసిందే. బ్రిడ్జిపై నుంచి వచ్చే కొవ్వూరు, ఏలూరు, జంగారెడ్డిగూడెం డిపోల బస్సులు ఈ నెల రోజులూ గామన్ బ్రిడ్జి, కాతేరు, కంబాల చెరువు మీదుగా రాజమహేంద్రవరం డిపోకు రాకపోకలు సాగిస్తాయన్నారు. తాడేపల్లి గూడెం, తణుకు, నిడదవోలు డిపోల బస్సులు విజ్జేశ్వరం బ్యారేజి, బొబ్బర్లంక, ధవళేశ్వరం, రైల్వేస్టేషన్, కోటిపల్లి బస్‌స్టాండు మీదుగా రాజమహేంద్రవరం కాంప్లెక్సుకు రాకపోకలు సాగిస్తాయన్నారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించి సహకరించాలన్నారు.



భూ చిక్కులకు చెక్

తప్పులు లేకుండా పరిశీలన



ప్రతి భూ హక్కు పత్రం, పట్టాదారు పాసు పుస్తకంలోని వివరాలను నిశితంగా పరిశీలించాలి. ముద్రించిన పాసు పుస్తకంలో డివిజన్, మండలం, గ్రామం పట్టా నంబర్, ఖాతానంబర్, ఆధార్, మొబైల్ నంబర్లు, విస్తీర్ణం విశిష్ట నంబర్లలో తప్పులు లేకుండా చూడాలి. టైటిల్ డీడ్‌లో తేడాలు ఉంటే రైతులకు బ్యాంకులు లోన్ ఇవ్వరు. సరైన వివరాలతోనే డిజిటలీకరించిన పాసు పుస్తకాలను రైతులకు అందజేసేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలి. తప్పులు సరిదిద్దడానికి ప్రింటైన పుస్తకాలను రీ ప్రింట్‌కు పంపేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్ ఇలక్కియ, జాయింట్ కలెక్టర్

- చురుగ్గా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం సర్వే పనులు
- రెండు విడతల్లో 205 గ్రామాల్లో సర్వే పూర్తి
- 1,23,701 మంది రైతులకు పత్రాల పంపిణీ
- మూడో విడత సర్వే చేపట్టేందుకు ప్రణాళిక

కాకినాడ సిటీ: చాన్నాళ్ల తర్వాత భూ వివాదాల చిక్కుముడులు వీడనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. బ్రిటీషర్ల కాలంలో భూముల సర్వే జరిగింది. తర్వాత ఏ ప్రభుత్వమూ ఈ అంశాన్ని ముట్టుకున్న దాఖలా లేదు. ఫలితంగా క్షేత్ర స్థాయిలో అనేక భూ సమస్యలు పేరుకుపోయాయి. ఈ క్రమంలో జగన్ సర్కారు సాహసోపేతమైన అడుగు వేసింది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టింది. భూముల కొలతలు, రికార్డులు స్వచ్ఛీకరణ కోసం రీసర్వే పనులు చేపట్టింది. జిల్లాలో రెండు విడతలుగా 205 గ్రామాల్లో ఈ సర్వే పూర్తయ్యింది. మూడో విడతలో మరో 90 గ్రామాల్లో అమలుకు ప్రణాళికలను సిద్ధం చేసింది.

మూడో విడత రీసర్వే

జిల్లాలోని రెండు రెవెన్యూ డివిజన్‌లో 21 మండలాల పరిధిలో 413 గ్రామాలు ఉన్నాయి. వీటిలో మొదటి విడతలో 121 గ్రామాలు, రెండో విడతలో 84 గ్రామాల్లో సర్వే ఆఫ్ ఇండియా నేతృత్వంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రీసర్వేను పూర్తి చేశారు. మూడో విడతలో కూడా రీసర్వేను చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో దీనిపై లోతుగా పరిశీలిస్తూ చేట్టిన పనులు ముమ్మరమయ్యాయి. సర్వే ఆఫ్ ఇండియా నుంచి ఓఆర్ఐ మ్యాపులు వచ్చిన రోవర్స్ సాయంతో అధికారుల బృందాలు రీ సర్వేను నిర్వహిస్తున్నాయి. మూడో విడతను డిసెంబర్ నెలాఖరునాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఫీల్డ్–పీఓఎల్‌ఆర్ అన్ని గ్రామాల్లో పూర్తి :

జిల్లాలో 413 గ్రామాల్లో మొదటి విడత చేపట్టిన 121 గ్రామాల్లో ఏరియల్ సర్వే తరువాతే పీఓఎల్‌ఆర్ (ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్)ను చేపట్టారు. సర్వే చేయడం ఆలస్యం అవుతుండడంతో ప్రభుత్వం కొత్త ఆలోచనకు తెర లేపింది. మొదటి ఫీల్డ్–పీఓఎల్ ఆర్ చేపట్టాలని నిర్ణయించింది. దీని ప్రకారం మొదట ఫీల్డ్‌పై సరిహద్దులు చూసుకొని వాటి ప్రకారం రికార్డులను స్వచ్ఛీకరించుకున్నారు. అలా మొదటి విడత కాక మిగిలిన 295 గ్రామాల్లో ఫీల్డ్ పీఓఎల్‌ఆర్ పూర్తి అయ్యింది. రీ సర్వేకు సంబంధించి ఓఆర్ఐ మ్యాపులు వచ్చిన వెంటనే రైతులకు నోటీసులు ఇచ్చి రోవర్ల సాయంతో సరిహద్దు రాళ్లను నాటుతున్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ:

రెండో విడతలో 84 గ్రామాలకు సంబంధించి 93689.672 ఎకరాల్లో రీ సర్వే జరిగింది. ఆయా గ్రామాల రైతుల పొలాలకు సరిహద్దు రాళ్లను సైతం నాటారు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన భూ హక్కు పత్రాలను అందజేస్తున్నారు. రెండో విడతలో 85,558 మంది రైతులకు 46,506 భూ హక్కు పత్రాలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే దాదాపు 38,616 మంది రైతులకు భూ హక్కు పత్రాలను అందజేశారు. మిగిలిన వారికి ఈనెలాఖరు నాటికి అందజేయాలనే లక్ష్యంతో అధికారులు పని చేస్తున్నారు. మరో వైపు మొదటి విడతలో 150773.2 ఎకరాలకు సంబంధించి 1,38,219 మంది రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. దీంతో రెండు విడతల్లో కలిపి 2,44,462.872 ఎకరాలకు సంబంధించి 2,23,777 మంది రైతులకు ఇప్పటి వరకు 1,23,701 భూ హక్కు పత్రాలను అందజేశారు.



రైతులతో కలిసి భూములను సర్వే చేస్తున్న సర్వే సిబ్బంది

విశిష్ట సంఖ్య ఆధారంగానే రిజిస్ట్రేషన్

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రైతుల భూముల క్రయ, విక్రయాలను ఆ భూమికి ఉన్న విశిష్ట సంఖ్య ఆధారంగానే చేపడతారు. తద్వారా ఒక భూమి డబుల్ రిజిస్ట్రేషన్ అవ్వడానికి వీలు కుదరదు. ప్రయత్నించినా ఆ పట్టాదారు పాసు పుస్తకంతో అనుసంధానమైనా ఆధార్, మొబైల్ నంబర్లకు మెసేజ్ వెళ్లితే సంబంధిత యజమానులు అప్రమత్తమవుతారు.

ప్రతి పొలానికీ విశిష్ట నంబర్

క్షేత్రస్థాయిలో భూమి వివరాల కోసం రీ సర్వే, భూ రికార్డుల్లో మార్పుల కోసం రికార్డుల స్వచ్ఛీకరణను గ్రామాల వారీగా నమోదు చేయిస్తున్నారు. రీ సర్వే, పీఓఎల్‌ఆర్ ప్రక్రియలు పూర్తయిన రైతులకు డిజిటల్ భూ హక్కు పత్రం, పట్టాదారు పాసు పుస్తకం ఇస్తున్నారు. ప్రతి భూమికి విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. ఆ సంఖ్యను మరెక్కడా వినియోగించరు. ప్రస్తుతం ప్రతి భూమికి సర్వే నంబర్లు ఉన్నా డివిజన్లుగా విభజనతో మోసాలకు ఆస్కారం ఎక్కువైంది. ఆ విశిష్ట సంఖ్య రైతు ఆధార్, మొబైల్ నంబర్లతో అనుసంధానమై ఉంటుంది. ఎవరైనా మార్చాలని చూసినా హక్కుదారుడి మొబైల్‌కు మెసేజ్ వెళ్తుంది. దీనిలో భూమి కొలతలతో పాటు సర్వే మ్యాపు ఉంటుంది. అందులో రైతుల వివరాలు తెలుగు, ఇంగ్లీషులో ఉంటాయి. ఖాతా నంబర్, విస్తీర్ణం, ఆధార్‌నంబర్, మొబైల్ నంబర్ల వివరాలు కూడా ఉంటాయి.

రత్నగిరిపై శయన గణపతి

నేడు ఘనంగా నిమజ్జనం



శయన గణపతిగా దర్శనమిచ్చిన వినాయకుడు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. తొమ్మిదో రోజు మంగళవారం వినాయకుడు శయన గణపతిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఉదయం 7 గంటలనుంచి 9గంటల వరకు గణపతికి పుష్పాలు, గరికతో పూజలు చేశారు. రాత్రి పూజలు నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. ప్రసాదాలు నివేదించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. నవరాత్రులు ముగిసిన సందర్భంగా బుధవారం ఉదయం వార్షిక కల్యాణ మండపం వద్ద లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తారు. 11–30 గంటలకు పూర్ణాహుతి జరుగుతుంది. మధ్యాహ్నం రత్నగిరి నుంచి ఊరేగింపుగా వినాయకుల విగ్రహాలను కొండ దిగువకు తీసుకువచ్చి మెయిన్ రోడ్‌లో ఊరేగిస్తారు. అనంతరం పంపా నదిలో నిమజ్జనం చేస్తారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు, ప్రతపురోహితులు, అందరూ తప్పక పాల్గొనాలని, ఊరేగింపు దారి పొడవునా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయాలని ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశించారు.

ఇండోర్ వెళ్లిన కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కాకినాడ స్మార్ట్ సిటీకి పారిశుధ్య నిర్వహణలో దేశంలో రెండోవ స్థానం పొందిన నేపథ్యంలో ఇండియన్ స్మార్ట్ సిటీ అవార్డ్స్–2022 స్వీకరించేందుకు కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం ఇండోర్ బయలుదేరి వెళ్లారు. ఆమె బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్మార్ట్ సిటీ అవార్డు అందుకోనున్నారు.

జయలక్ష్మి సొసైటీ ఛైర్మన్ పదవీకాలం పెంపు





జయలక్ష్మి సొసైటీ నూతన కార్యవర్గం ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా రెండవ సారి ఎన్నికైన త్రినాథరావు, రమణమూర్తి, మహాజనసభకు హాజరైన సభ్యులు

సొసైటీ మహాజనసభ తీర్మానం

కాకినాడ రూరల్: జయలక్ష్మి సొసైటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల పదవీకాలం మరో ఐదేళ్లు పొడిగిస్తూ మహాజనసభ తీర్మానించింది. కాకినాడ దంటు కళాక్షేత్రంలో మంగళవారం ఈ సొసైటీ రెండవ మహాజనసభ జరిగింది. దీనికి సొసైటీ ఛైర్మన్ త్రినాథరావు అధ్యక్షత వహించారు. గత ఏడాది సొసైటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్న నేపథ్యంలో రానున్న అక్టోబర్ 3వ తేదీ నాటికి ఛైర్మన్ త్రినాథరావు, వైస్ ఛైర్మన్ పీవీ రమణమూర్తిల పదవీకాలం ముగుస్తోంది. దీంతో మరో ఐదేళ్లపాటు వీరిద్దరినీ కొనసాగించేలా మహాజనసభ తీర్మానించింది. అలాగే చార్టెడ్ అకౌంటెంట్ నియామకం, కొత్తగా వివాదాల పరిష్కార కమిటీ ఏర్పాటు, డిపాజిటర్ల సొమ్ములో 40శాతం షేర్‌హోల్డర్, 60 శాతం సేవింగ్ అకౌంట్‌లో పొందుపరిచే అంశాలపై తీర్మానాలు చేసింది. ఏడాదిగా తాము చేపట్టిన కార్యక్రమాలు, వాటి నిర్ణయాలు, పురోగతిపై ఛైర్మన్ నివేదిక సమర్పించారు. గత పాలకవర్గంలో రుణాలు పొంది ఎగ్గొట్టినవారి వారికి సంబంధించిన 64 ఆస్తులను జప్తు చేశామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు సొమ్ము చెల్లించాల్సి ఉందన్నారు. మరికొన్ని ఆస్తులు జప్తునకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.5 కోట్ల వరకు వసూలు చేశామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఏవీఎస్ కుమార్, సుబ్బారావు, గౌరీశంకరరావు, షేక్‌జానీబాషా, అముజూరి శ్రీనివాస్, స్వామిప్రసాద్, గవర్రాజు కుమార్, బాధితుల సంఘ నాయకులు బదిరీనాథ్, నర్సింగరావు, బాలు విశ్వనాథ్, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మహాజనసభకు సుమారు 800 మంది సభ్యులు హాజరయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు విశాఖ, కృష్ణాజిల్లాకు చెందినవారు ఉన్నారు.

బీచ్‌లో నిమజ్జన వేడుకలకు సన్నాహాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కాకినాడ రూరల్: వినాయక చవితి వేడుకలు ముగింపు సందర్భంగా విగ్రహాల శోభాయాత్రకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 18 నుంచి చలువ పందిళ్లలో కొలువైన గణనాథుల విగ్రహాల నిమజ్జనోత్సవం ఘనంగా జరిపేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. కాకినాడలో ప్రధానంగా సూర్యారావుపేట బీచ్ వద్ద సాగర తీరం ఇందుకు వేదిక కానుంది. రెండు రోజులు పాటు నిమజ్జనోత్సవం జరుగుతుందని భావిస్తున్నారు. బుధవారం 750 నుంచి వెయ్యి విగ్రహాల వరకూ సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనం చేస్తారని అంచనా. గణేష్ నగర, రూరల్ ఉత్సవ కమిటీలు భక్తులకు అండగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. కలెక్టరు ఆదేశాల మేరకు సూర్యారావుపేట బీచ్‌లో బ్యారికేడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయం, ప్రథమ చికిత్స సౌకర్యం వంటివి సమకూర్చుతున్నారు. ఇందుకు రెవెన్యూ, పంచాయతీ రాజ్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. సివిల్ పోలీసులు 50మంది, 10 మంది మెరైన్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అత్యవసర సేవల కోసం లైఫ్ జాకెట్లు ధరించే 30మంది గజ ఈతగాళ్లను, మూడు పడవలను సిద్ధం చేశారు. బయట రెండు అగ్ని మాపక వాహనాలు,అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. భారీ విగ్రహాల నిమజ్జనానికి రెండు భారీ క్రేన్లు ఏర్పాటు చేశారు. సూర్యారావుపేట బీచ్‌లో పాటు కాకినాడలో ఉప్పుటేరు వద్ద వార్ఫ్ రోడ్డులో బ్రహ్మం గారి గుడి వద్ద, వన్ టౌన్ పోలీసు స్టేషన్, కమర్షియల్ రోడ్లులో ఉన్న నిమజ్జన ప్రాంతాలలో నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సముద్రం లోపలకు భక్తులు వెళ్లరాదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ట్రాఫిక్‌లో విగ్రహాలు చిక్కులో చిక్కుకోకుండా వరుసగా వచ్చేలా చూడాలని ఎస్పీ సూచించారు. ఆర్డీఓ సత్యనారాయణ, తహశీల్దార్ మురార్జీ, ఎంపీడీఓ స్వప్న, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ తదితరులతో ఏర్పాట్లపై సమీక్షించారు. అడిషనల్ ఎస్పీ పి.శ్రీనివాస్, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



సూర్యారావుపేట బీచ్‌లో బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు

సాగరతీరానికి కొత్త సొగసులు!

- బ్లూఫాగ్ బీచ్‌గా కాకినాడ తీరం
- మరో 21 బీచ్‌ల అభివృద్ధికి చర్యలు
- పర్యావరణ శాఖ అనుమతులే ఆలస్యం
- గోవా బీచ్‌లను తలపించేలా వసతులు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



పిఠాపురం: ఎప్పుడూ ఒకే చోట ఉంటే జీవితం కలర్‌ఫుల్‌గా ఉండదు. ప్రకృతి రమణీయతను ఆస్వాదించాలి. అందుకు పలుచోట్ల పర్యటించాలి. అక్కడి విశేషాలను తెలుసుకోవాలి. ఇది మనిషి మనసుపై ఎంతో ప్రభావం చూపుతుంది. అక్కడి అందాలతో మానసిక ఉల్లాసం పొందవచ్చు. ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. అక్కడి వారి సంస్కృతి, జీవనోపాధి తెలుసుకోవచ్చు. ఆయా ప్రాంతాల వారి జీవన శైలిని అంచనా వేసుకోవచ్చు. ఎక్కడెక్కడో ఉన్న ప్రకృతి సౌందర్యాలను తనివితీరా చూడడం ఎన్నో మధురానుభూతులను మిగులుస్తుంది. పర్యాటక ప్రాముఖ్యత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక విలువల గురించి అంతర్జాతీయంగా ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రపంచ పర్యాటక దినోత్సవ ప్రాముఖ్యత. యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ వారు 1980లో మొదటి సారిగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సెప్టెంబర్ 27న నిర్వహించడం ప్రారంభించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు



అన్నవరంలో రూ.50 కోట్లతో ప్రసాద్ పథకం కింద కొన్ని నిర్మాణాలు, కాకినాడ హోప్ ఐలాండ్‌కు త్వరలో బోటు సౌకర్యం, ఉప్పాడలో రూ.12 కోట్లతో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ నిర్మాణం, పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా కాకినాడ సాగర సంబరాల బీచ్‌ను బ్లూఫాగ్ బీచ్‌గా అభివృద్ధి చేయనున్నాం. దీనికి ఇప్పటికే ప్రతిపాదనలు పూర్తయ్యాయి. ఇంకా కొన్ని అనుమతులు రావాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటారు.

– ఒంటెద్దు స్వామినాయుడు, ఆర్డీ, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ, రాజమహేంద్రవరం

పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి

పర్యాటకులను ఆకట్టుకోడానికి ప్రభుత్వం పర్యాటక శాఖ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లాలో బౌద్ధారామాలు, మొఘల్ చక్రవర్తులు, రాజపుత్ర వంశీయుల చారిత్రక సంపద, లెక్క లేనన్ని హిందూ దేవాలయాలు, నదులు, కొండలు, గుట్టలు, సముద్ర తీర ప్రాంత, అడవులు ఇలా ఎన్నో చారిత్రక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని కాపాడడంతో పాటు వాటి విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవడం ద్వారా పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ప్రపంచ పర్యాటకులను ఆకర్షించడంలో పర్యాటక శాఖ ముందుంటోంది.

సాగరతీరానికి పర్యాటక శోభ

నీలి సముద్రం.. ఉప్పొంగే కెరటాలు.. ఇసుక తిన్నెలు.. మనసుకు అహ్లాదాన్నిచ్చే సాగర హోరు ప్రకృతిని పరవసింపజేసే సాగరతీర అందాలు. ఎంతో అందమైన సాగర తీరం వెంబడి 22 బీచ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫిషరీష్ యూనివర్శిటీ, పర్యాటక శాఖ, మత్స్యశాఖలతో కూడిన బృందం ఎక్కడెక్కడ బీచ్‌లు అభివృద్ధి చేయవచ్చో అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జిల్లాలో ప్రస్తుతం కాకినాడలో బీచ్ ఉండగా మరో 21 ప్రాంతాల్లో బీచ్‌లను అభివృద్ధి చేయనున్నారు. దేశంలో 10 బ్లూఫాగ్ బీచ్‌లు ఉండగా మన రాష్ట్రంలో విశాఖ రుషికొండ బీచ్ బ్లూఫాగ్ బీచ్‌లలో స్థానం సాధించింది. అటువంటి బీచ్‌ను కాకినాడలో అభివృద్ధి చేయనున్నారు. కోస్టల్ జోన్ రెగ్యులేషన్ నోటిఫికేషన్ ప్రకారం ఈ మేరకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ ప్రక్రియ పూర్తయితే గోవా బీచ్‌లను తలపించేలా ఇక్కడి బీచ్‌లు పర్యాటకులను ఆకర్షించనున్నాయి. కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు రాగానే ఈ పనులు చేపట్టనున్నారు. బీచ్‌ల అభివృద్ధితో స్థానికంగా ఉపాధితో పాటు పర్యాటక రంగం మరింత అభివృద్ధి సాధించనున్నాయి.

రూపురేఖలు మారనున్న సాగర తీరం

ఈ బీచ్‌లు అభివృద్ధి చెందితే తీరం రూపురేఖలు విశేషంగా మారనున్నాయి. కొత్తందాలకు నెలవు కానున్నాయి. కాకినాడ సాగర సంబరాల బీచ్ (బ్లూఫాగ్ బీచ్), ఎన్‌టీఆర్ బీచ్, నావెల్ డాక్‌యార్డు బీచ్, నేమాం బీచ్, హోప్ ఐలాండ్, దానవాయిపేట బీచ్, గడ్డిపేట, అద్దరిపేట, పంపాదిపేట, యర్రయ్యపేట, అన్నయ్యపేట, ఎల్లయ్యపేట, నర్సిపేట, తలపంటిపేట, కె.చోడిపల్లిపేట, కోనపాపపేట, కుంభాభిషేకం, పెరుమాళ్లపురం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్, ఉప్పాడ బీచ్, కోరంగి మడ అడవులు, యానాం బీచ్‌లు ఈ అభివృద్ధిలో భాగం కానున్నాయి.



జిల్లాలో పర్యాటక ప్రాంతాలు ఇవీ..

కాకినాడ బీచ్ కాకినాడ నుంచి తుని సమీపంలో అద్దరిపేట వరకు ఉన్న సాగరతీరం ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. కాకినాడ వద్ద బీచ్ పార్కు, తీరం వెంబడి ఉన్న బీచ్‌రోడ్డు తీర ప్రాంతం, అద్దరిపేట వద్ద ఉన్న సాగరతీరం, పంపు హౌస్‌లు పిక్నిక్ స్పాట్‌లుగా వెలుగొందుతున్నాయి.

హోప్ ఐలాండ్

కాకినాడ సమీపంలో సముద్రం మధ్యలో సహజంగా ఏర్పడిన ద్వీపం హోప్ ఐలాండ్. ప్రస్తుతం ఇది మంచి పిక్నిక్ స్పాట్‌గా మారింది. కాకినాడ హార్బర్, కోరంగి మడ అడవుల నుంచి ఇక్కడకు వెళ్లే సౌకర్యాలు ఉన్నాయి.

కోరంగి మడ అడవులు

కాకినాడ సమీపంలోని తాళ్లరేవు మండలంలో ఉన్న మడ అడవులు పచ్చని చెట్లతో కనువిందు చేస్తూ పర్యాటకులను కట్టిపడేస్తాయి. వీటిని అభివృద్ధి చేయడంతో పాటు మరిన్ని ప్రాంతాలు అభివృద్ధి చేసి సౌకర్యాలు కల్పించనున్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఛరిష్మసాయి రుత్వి



అంబాజీపేట: రాష్ట్ర స్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని నిమ్మకాయల ఛరిష్మ సాయి రుత్వి ఎంపికైనట్టు హెచ్‌ఎం కడలి సాయిరామ్ తెలిపారు. అంబాజీపేట హైస్కూల్‌లో సాయి రుతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం అభినందించారు. అనపర్తిలో ఈ నెల 25న జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల వాలీబాల్ పోటీల్లో ఛరిష్మసాయిరుత్వి అత్యంత ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఛరిష్మసాయిరుత్వికి శిక్షణ ఇచ్చిన పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, అశ్వా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబులను పలువురు అభినందించారు. ఇటీవల బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పాండిచ్చేరీలో నిర్వహించిన జాతీయ స్థాయి అండర్ -14 బాస్కెట్‌బాల్ పోటీలలో రాష్ట్ర జట్టుకు చరిష్మ ఎంపికైన విషయం తెలిసిందే. బాస్కెట్‌బాల్‌తో పాటు వాలీబాల్‌లో కూడా రాణించడం పట్ల ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, వి.సత్యనారాయణ, బీఎస్ఎన్ మూర్తి, విద్యార్థులు అభినందనలు తెలిపారు. అలాగే ముక్కామల జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఇసుకపట్ల సలోమి స్టాండ్ బైగా ఎంపికైనట్లు పీడీ ముత్యాల పవన్ కిషోర్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన మహేష్, అశోక్

రాజోలు: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన చింతలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న యార్లగడ్డ మహేష్, కొల్లు అశోక్‌ను ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య మంగళవారం అభినందించారు. విజయవాడలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో అండర్-17 విభాగంలో 80 కేజీల కేటగిరిలో మహేష్ రజత పతకం సాధించగా, అశోక్ 71 కేజీల కేటగిరిలో కాంస్య మెడల్ సాధించాడని హెచ్‌ఎం వివరించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలలూ..ప్రాజెక్టులు రూపొందిద్దామా..!

- 31వ నేషనల్ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనకు సన్నాహం
- విద్యార్థులకు చక్కని అవకాశం
- పాఠశాలల నుంచి ప్రాజెక్టులకు ఆహ్వానం
- 29, 30 తేదీల్లో సైన్స్ టీచర్లకు జిల్లా స్థాయి ఓరియంటేషన్ తరగతులు



రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఎంబ్లమ్

రాయవరం: నేటి బాలలే.. భవిష్యత్ శాస్త్రవేత్తలు అవుతారన్నది అక్షర సత్యం. ఈ విషయాన్ని అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలు నిరూపించారు. తన గురువు సుబ్రహ్మణ్యన్ అయ్యర్ చెప్పిన సైన్స్ పాఠం డాక్టర్ అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్‌గా మారడానికి కారణమైంది. అందుకే చిన్నారుల చిట్టి మెదళ్లలోని గట్టి ఆలోచనలకు పదును పెట్టి, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఒక వేదికగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. చిరుప్రాయం నుంచే చిన్నారుల్లో శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేయగా, రాష్ట్ర స్థాయిలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో ప్రాజెక్టుల రూపకల్పనకు చర్యలు చేపడుతున్నారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం, రాష్ట్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి జిల్లా సైన్స్ కాంగ్రెస్ చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది.

ఐదు విభాగాల్లో పోటీలు

జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అన్ని యాజమాన్యాల పరిధిలోని 6-12 తరగతుల విద్యార్థులు 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2023లో పాల్గొనేందుకు అర్హులు. పాఠశాలలకు వెళ్లే వారితో పాటు 10 నుంచి 17 ఏళ్ల లోపు బడి మానేసిన వారూ ఇందులో పాల్గొనవచ్చు. జిల్లా స్థాయి వరకు 10-17 ఏళ్ల లోపు వారు పోటీల్లో పాల్గొనవచ్చు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 నుంచి 14 ఏళ్ల లోపైతే జూనియర్లుగా, 14 నుంచి 17 ఏళ్ల లోపు వారిని సీనియర్లుగా విభజించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, సృజనాత్మకతను ప్రోత్సహించి నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు సిద్ధం చేయించాలన్నదే జిల్లా సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనల ముఖ్య ఉద్దేశం. జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన తేదీని త్వరలో తెలియజేస్తారు.

ప్రాజెక్టులు సిద్ధం చేసుకోవాలిలా..

- జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించే ప్రాజెక్టులు సైన్స్ సూత్రాలను ప్రదర్శించే నమూనాలుగా ఉండాలి. - విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు ప్రధాన అంశానికి లోబడి, ఏదేని ఉప అంశానికి చెంది ఉండాలి.
- ప్రాజెక్టు ద్వారా సమస్యకు నిర్దిష్ట కాలంలో పరిష్కారాన్ని కనుగొనలేక పోయినప్పటికీ అధ్యయన పద్ధతి మాత్రం శాస్త్రీయంగా ఉండాలి.
- సమస్య అవగాహన, సృజనాత్మకత, నూతనత్వానికి ప్రాధాన్యమివ్వాలి.
- ఇద్దరు విద్యార్థులు టీమ్‌గా ప్రాజెక్టు నిర్వహించాలి.



గతేడాది జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థుల ప్రదర్శన

- చక్కని శీర్షికతో, సంబంధిత నిర్దేశిత భౌగోళిక ప్రాంత పరిధిలో ప్రాజెక్టు నిర్వహించాలి. పరిశీలనలను తేదీల వారీగా లాగ్‌బుక్‌లో నమోదు చేయాలి. దత్తాంశాలన్నింటినీ విశ్లేషించాలి.
- పరిశోధన ఫలితాన్ని వివరించాలి. వ్యాఖ్యానించాలి..సమస్యకు పరిష్కారాన్ని సూచించాలి. ప్రాజెక్టు మొత్తాన్ని రిపోర్టు రూపంలో డాక్యుమెంట్‌గా రూపొందించి పోటీల్లో సమర్పించాలి.
- 250 పదాలకు మించకుండా ప్రాజెక్టు సంక్షిప్త రూపం రాయాలి.

29, 30 తేదీల్లో డివిజన్ స్థాయిలో అవగాహన

ఈ నెల 29న రామచంద్రపురం డివిజన్, 30న అమలాపురం డివిజన్‌లో జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రాజెక్టుల తయారీ, విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉపాధ్యాయులకు అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రామచంద్రపురం డివిజన్ స్థాయి సమావేశం శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల, అమలాపురం డివిజన్ స్థాయి అవగాహన సమావేశం అమలాపురం మండలం కామనగరువులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి సారథ్యంలో ఈ సమావేశాలు నిర్వహించేందుకు జిల్లా సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా సైన్స్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం ఈ సమావేశాలకు కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. ప్రాజెక్టుల తయారీలో సూచనలు, సలహాలకు అకడమిక్ కోఆర్డినేటర్‌గా పీవీ బ్రహ్మానందం వ్యవహరించనున్నారు.

ఇవీ ప్రధాన, ఉప ప్రధాన అంశాలు

- ఈ ఏడాది ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడాన్ని ప్రధాన అంశంగా విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంది.
- మీ పర్యావరణ వ్యవస్థను తెలుసుకోండి.
- ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సును పెంపొందించడం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు.
- స్వీయ ఆధారితం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణలు ఉప అంశాలుగా తీసుకోవాలి.
- విద్యార్థులు ఈ ఐదు ఉప అంశాల్లో నమూనాలు సిద్ధం చేసుకోవచ్చు.

దరఖాస్తు చేయాలిలా..

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో నమూనాలు ప్రదర్శించడానికి ఆయా పాఠశాలలు ముందుగానే ఆన్‌లైన్‌లో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం(96401 88525)కు దరఖాస్తు చేసుకోవాలి.

సైన్స్ టీచర్ల మార్గదర్శకత్వం



ప్రతి పాఠశాల నుంచి కనీసం రెండు నుంచి మూడు ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి. ప్రాజెక్టులు రూపొందించే విద్యార్థులకు సైన్స్ టీచర్లే గైడ్ టీచర్లుగా వ్యవహరిస్తారు.

గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, జిల్లా కోఆర్డినేటర్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్, అమలాపురం.

ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ప్రాతినిధ్యం



జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలకు ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండాలి. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులదే ప్రధాన బాధ్యత.

- ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

గణపయ్యో గైకొనవయ్యా నైవేద్యాలు!



మొగలికుదురులో కరెన్సీతో వినాయకునికి అలంకరణ



మోరిపాలంలో వినాయకునికి సమర్పించిన వంటకాలు

మామిడికుదురు: గణపతి నవరాత్ర వేడుకల్లో భాగంగా ఆదుర్రు శివారు మోరిపాలంలో విఘ్నేశ్వరునికి 190 రకాల వంటకాలు నివేదించారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 108 శివలింగాలకు అర్చన, జ్యోతిర్లింగార్చన ఘనంగా జరిగాయి. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. మొగలికుదురు జున్నూరి నగర్‌లో ఏర్పాటు చేసిన పృథ్వీ గణపతిని రూ.50 వేల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. 100, 50, 20 నోట్లతో గణపతి మంటపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

మాదక ద్రవ్యాలతో ముప్పు

ఆర్ఎంసీలో అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రరావు

కాకినాడ క్రైం: మాదక ద్రవ్యాలు నిండు జీవితానికి ముప్పును తీసుకొస్తాయని వైద్య ప్రముఖులు వెల్లడించారు. మాదక ద్రవ్యాల వినియోగ నివారణే లక్ష్యంగా వైద్య విద్యార్థులకు ఆర్ఎంసీ యాజమాన్యం ఆర్ఎంసీ మెన్ హాస్టల్‌లో అవగాహన సదస్సు నిర్వహించింది. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి మానసిక, సామాజిక బలహీనతలకు లొంగొద్దని కోరారు. తల్లిదండ్రులు మీ భవితపై కొండంత ఆశతో ఉన్నారని గుర్తు చేశారు. వైద్య విద్యార్థులుగా ఆరోగ్యవంతమైన, ఆదర్శవంతమైన జీవన శైలితో సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నారని తెలిసినా, విక్రయిస్తున్న ఉదంతాలు బయటపడినా తక్షణమే కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వాలన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఉన్నత విద్యావంతులు కూడా ఉన్మాదులుగా మారిన దాఖలాలు ఉన్నాయని ఉదాహరణలతో వివరించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం సూచనలతో జరిగిన ఈ సదస్సులో సైకియాట్రీ నిపుణులు డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ వరప్రసాద్, ఫోరెన్సిక్ నిపుణులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఫణికిరణ్, పల్మనాలజీ నిపుణురాలు డాక్టర్ సూర్యకుమారి, హాస్టల్ వార్డెన్ డాక్టర్ వీరయ్య, క్యాంపస్ ఆఫీసర్ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

ఏడుగురు హిజ్రాలకు జైలు

కాకినాడ లీగల్: తాళ్లరేవు మండలం లచ్చిపాలెం ఎన్‌హెచ్-16 రహదారిపై వెళుతున్న వాహనదారులను ఆపి వారి పట్ల అసభ్యకరంగా వ్యవహరించడంతో కోరంగి పోలీసులకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్‌కు మార్ 24వ తేదీన కేసు నమోదు చేశారు. ఏడుగురు హిజ్రాలను మంగళవారం కాకినాడ కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి 24 గంటల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్ వీరభద్రుడు తీర్పు చెప్పారు. హిజ్రాలను సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు.